క్లుప్తంగా

నేడు మెగా లోక్ అదాలత్

ఎమ్మిగనూరు: జాతీయ మెగా లోక్అదాలత్ను శనివారం ఎమ్మిగనూరు ఫస్ట్క్లాస్ కోర్టులో నిర్వహించనున్నట్లు మెజిస్ట్రేట్ గురు అరవింద్ పేర్కొన్నారు. కక్షిదారులు రాజీమార్గంలో పయనించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సూచించారు. పోలీసు, రెవెన్యూ యంత్రాంగం ప్రజాచైతన్యం ద్వారా లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించాలని కోరారు.

జయప్రదం చేయండి

ఎమ్మిగనూరురూరల్: ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకై ఈ నెల 14వ తేదీ పట్టణంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి వాల్మీకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయ్యాలని ఆ సంఘం నాయకులు కొండయ్య, యాపిలయ్య, రాజేష్, వీరేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని కోటేకల్, బోడబండ, వెంకటగిరి గ్రామాల్లో వాల్మీకులతో సమావేశాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 14న అజంతా ఫంక్షన్ హాల్లో సమావేశం జరుగుతుందని, పార్టీలకతీతంగా వాల్మీకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. శుక్రవారం గోనెగండ్లలో ఎమ్మిగనూరు – కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు లేనివారికి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ వాహన దారులు రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

వెల్దుర్తి: రామళ్లకోట గ్రామంలో మత సామరస్యాన్ని చాటుతూ శివ మాలధారులకు మసీదు ఇమాం మిట్టమీది హఫీజ్ ఖాసిం బాషా అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి గ్రామ శివాలయంలో మాలధారులు కాశేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఖాసిం బాషా స్థానిక ముస్లిం యువకులతో కలిసి స్వయంగా వడ్డించిన అన్నదానం స్వీకరించారు. సర్వమతాల సారాంశం ఒక్కటే అన్నరీతిలో జరిగిన ఈ కార్యక్రమంలో భిక్ష స్వీకరించిన స్వాములు, ఏర్పాటు చేసిన ముస్లిం పెద్ద ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆస్పరి: గత డిసెంబర్ నెలలో కర్నూలులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ –14 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ఆస్పరి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఆనందరావు తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆలీయూనస్, 8వ తరగతి చదువుచున్న భవాని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడంతో శుక్రవారం వారిని హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులు, సర్పంచ్ మూలింటి రాధమ్మ, పాఠశాల చైర్మన్ గోవర్ధన ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

సకాలంలో విద్యుత్ కనెక్షన్లు అందజేస్తాం

కృష్ణగిరి: సీనియారిటీ ప్రకారం అర్హులైన రైతులందరికీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందజేస్తామని ట్రాన్స్కో ఏఈ మద్దిలేటి తెలిపారు. కృష్ణగిరి సబ్స్టేషన్లో శుక్రవారం ఆయన రైతులతో మాట్లాడారు. 2019లో పెండింగ్లో ఉన్న రైతులందరికీ, 2020లో డీడీలు కట్టిన వారికి కూడా ట్రాన్స్ఫార్మర్లు వచ్చాయన్నారు. వీటిని సీనియారిటీ జాబితా ఆధారంగా అందజేస్తున్నామన్నారు. త్వరలోనే పెండింగ్లో ఉన్న రైతులందరికీ విద్యుత్ కనెక్షన్లు అందిస్తామని ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా వాల్టా చట్టం సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

ఆధార్ అనుసంధానం వేగవంతం చేయండి

కృష్ణగిరి: ఓటరు కార్డులకు ఆధార్ నంబర్ తప్పనిసరిగా అనుసంధానం చేయాలని తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఆర్వోలు, బీఎల్ఓలతో మాట్లాడారు. మండలంలోని 35,426 మంది ఓటర్లకు గాను ఇప్పటివరకు ఆధార్ అనుసంధానం 71 శాతం పూర్తయిందన్నారు. మిగిలిన వారందరికీ ఆధార్ అనుసంధానం ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలని సూచించారు. అలాగే కొత్తగా ఓటరుకు దరఖాస్తులను కూడా స్వీకరించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

తుగ్గలి: మండల కేంద్రంలో శనగ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనగ పంట నూర్పిళ్లు పూర్తయ్యాయని, క్వింటాలుకు రూ.8 వేలు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. గతేడాది పంటల బీమా అందని రైతులకు వెంటనే పరిహారం ఖాతాల్లో జమ చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు శ్రీరాములు, రంగస్వామి, గంగాధర, బసవరాజు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల నియంత్రణకు చర్యలు

పత్తికొండ రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ప్రభుత్వం నియంత్రించిందని పత్తికొండ మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం పత్తికొండలోని తేరుబజారులో రథోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. అనుమతి లేకుండా ఎక్కడైనా ఎవరైనా ఫ్లెక్సీలు, నిషేధిత బ్యానర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ఊర్లో చాటింపు వేయించామన్నారు. తిరునాల ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, అధికారులందరూ సహకరించాలని కోరారు.

జగనన్న ఆశయాన్ని నెరవేరుద్దాం

- ప్రజా సంక్షేమానికి సైనికుల్లా పనిచేయాలి
- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని, ఆయన పాలనా ఫలాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఆయా క్లస్టర్లలో గృహసారథులు కీలక పాత్ర వహించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం మద్దికెరలోని డీపీఏపీ కమ్యూనిటీ హాలులో మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ చేరువ చేయాలన్నారు. గ్రామీణ ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రతి పథకం నేరుగా లబ్ధిదారులకు అందుతోందన్నారు. ప్రస్తుతం మరొక అడుగు ముందుకు వేస్తూ నూతనంగా గృహసారథులను నియమించిందన్నారు. అర్హులైన వారికి పథకాలు అందకపోతే వెంటనే అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గృహ సారథుల సేవలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దేవిరెడ్డి మురళీధర్రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, వైస్ ఎంపీపీ మహేష్రెడ్డి, సర్పంచులు బండారు సుహాసిని, విజయుడు, మల్లికార్జున, ఎంపీటీసీలు గద్దల ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, నాయకులు వెంకటేశ్వరెడ్డి, శాంతన్న, భద్రయ్య, బండారు ఆంజనేయులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తుగ్గలి: మండల పరిధిలోని పెండేకల్లు ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. 50 ఏళ్ల అనంతరం పూర్వ విద్యార్థులంతా ఒకేచోట కలుసుకోనున్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థి హైకోర్టు జడ్జి ఎం.గంగారావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. పాఠశాల అభివృద్ధికి జడ్జి తన వంతు సహకారం అందిస్తారని ఆయన బాల్య స్నేహితుడు పెండేకల్లు భాస్కరరెడ్డి తెలిపారు. నాలుగేళ్ల క్రితం ఇక్కడున్న ఎస్సీ హాస్టల్ మూతపడింది. జెడ్పీ ఉన్నత పాఠశాల ముందు ఆక్రమణలు ఇతర సమస్యలను స్థానికులు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జడ్జి జిల్లా కలెక్టర్, పలువురు ఉన్నతాధికారులతో మాట్లాడి హాస్టల్ పునఃప్రారంభానికి కృషి చేశారు. ఆక్రమణలు తొలగించారు. కలెక్టర్ ప్రత్యేక నిధులు, ఉపాధి పథకం నిధులు రూ.60 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. చదివిన పాఠశాల అభివృద్ధికి జడ్జి తనవంతు కృషి చేస్తున్నారని సహచర విద్యార్థులు చెబుతున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి జడ్జి వస్తుండడంతో ఇప్పటికే జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించి వెళ్లారు.

కుష్టు నిర్మూలనకు కృషి చేయాలి

ఎమ్మిగనూరురూరల్: కుష్టు వ్యాధి నిర్మూలన మనందరి బాధ్యత అని వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రకోట గ్రామంలోని జిల్లా పరిషత్ పరిషత్ పాఠశాలలో దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలు, విద్యార్థులు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించేందుకు ఈ నెల 13వ తేదీ వరకు ప్రచార కార్యక్రమాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ వ్యాధి 'మైకో బ్యాక్టీరియం లెప్రే' అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. డీపీఎంఓ చంద్రయ్యశెట్టి, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహులు, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, ఆషా, ప్రధానోపాధ్యాయులు రఘు తదితరులు పాల్గొన్నారు.


ఎర్రకోట జెడ్పీ స్కూల్లో మాట్లాడుతున్న జగన్మోహన్ రెడ్డి

కల్యాణం.. కమనీయం

పత్తికొండ రూరల్: స్థానిక శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి రథోత్సవం సందర్భంగా శుక్రవారం శివపార్వతులు, బ్రహ్మంగారి దంపతుల ఉత్సవ విగ్రహాల కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. అర్చకులు బ్రహ్మయ్యాచారి, శరభయ్యాచారి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి మాంగళ్యధారణ భక్తజనుల మధ్య కనుల పండువగా జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సాయంత్రం ప్రభోత్సవాన్ని నిర్వహించారు.

నేడు రథోత్సవం

భక్తుల ఇలవేల్పుగా కొలువైన బ్రహ్మంగారి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం రథాంగ హోమం, ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం జరిగే రథోత్సవ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానుండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు.


పత్తికొండలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

హొళగుంద: సమ్మతగేరి వద్ద ఉన్న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) ఆధునికీకరణ పనులు చేపడ్తున్న కంపెనీలో సూపర్వైజర్గా పనిచేస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన కనుమర్ల రఘునాథరెడ్డి (20) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ అబ్దుల్జహీర్ శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన కనుమర్ల రఘునాథ రెడ్డి సమ్మతగేరి వద్ద ఎల్లెల్సీ ఆధునికీకరణ పనులు చేస్తున్న స్టాండర్డ్ ఇన్ఫ్రాటెక్ ఇండియా కంపెనీలో సూపర్వైజర్గా పనిలో చేరాడు. కాలువకు నీరు రావడంతో పనులు ఆగిపోయాయి. నిర్మాణ సామగ్రి అక్కడే ఉండడంతో రఘునాథ రెడ్డి మూడు నెలలుగా కాపలాగా ఉంటున్నాడు. ఈ స్థితిలో గురువారం సదరు యువకుడు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కంపెనీలో పని చేసే సిబ్బంది హొళగుంద పీహెచ్సీకి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక రఘునాథ రెడ్డి మృతి చెందాడు. ఇదిలాఉండగా.. ఎల్లెల్సీ పనుల కోసం తీసుకొచ్చిన కంకర అమ్ముకున్నాడని ఆరోపిస్తూ కంపెనీ ఎండీ శేషిరెడ్డి, మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా కొట్టడం వల్లే తన కుమారుడు చనిపోయాడని, వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి వెంకట రంగారెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.


కనుమర్ల రఘునాథ రెడ్డి(ఫైల్)

కాంట్రాక్టర్పై కేసు నమోదు

ఎమ్మిగనూరు: అనంతపురం జిల్లాకు చెందిన క్లాస్–1 కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డిపై కేసు నమోదైంది. సబ్ కాంట్రాక్టర్కు బిల్లులు చెల్లించకుండా స్వాహాచేసి, అతని ఆస్తులను బలవంతంగా అమ్మించాడనే అభియోగాలతో బాధితుడు పాతకోట ప్రతాప్రెడ్డి ఎమ్మిగనూరు ఫస్ట్క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేశారు. మెజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు బాలనాగిరెడ్డి, మరో కాంట్రాక్టర్ అల్లూరు రెడ్డి వురఫ్ చాపల రెడ్డిపై సెక్షన్లు 420, 506, 156 (క్లాస్–3), రెడ్విత్ 34 ఐపీసీల కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ మధుసూదన్రావు తెలిపారు. బాధితుడు ప్రతాప్రెడ్డి కాంట్రాక్టర్ బాలనాగిరెడ్డి నుంచి ఆర్అండ్బీ కాంట్రాక్టు పనులు పొంది సబ్ కాంట్రాక్టర్గా పనులు చేయించేవాడు. అందులో భాగంగా రూ.70 లక్షలతో ఎమ్మిగనూరు–సోగనూరు రోడ్డు పనులు చేపట్టాడు. వాటిలో కాంక్రీట్ పనులను మరో కాంట్రాక్టర్ అల్లూరు రెడ్డిచే చేయించారు. అలాగే గూడూరు–ఎమ్మిగనూరు రోడ్డును రూ.1.2 కోట్లతో తాను చేపడితే ఆయన అకౌంట్లో పడిన బిల్లులను చెల్లించకుండా మోసగించాడని, అలాగే తనతో ఖాళీ బాండ్ పేపర్లపై సంతకాలు చేయించుకుని హెచ్.మురవణిలో తన స్వాధీనంలో ఉన్న హాట్మిక్స్ ప్లాంట్, మిషనరీ, టిప్పర్లు, ట్రాక్టర్లతో పాటు ప్లాంట్ ఉన్న పొలాన్ని అల్లూరు రెడ్డికి రాసిచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

తొగర్చేడులో ముగిసిన ధార్మిక కార్యక్రమం

కృష్ణగిరి: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో జరిగిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గోపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామి ప్రవచనాలను వివరించారు. స్థానిక భజన బృందంచే గానకచేరి నిర్వహించారు. సర్పంచ్ రేణుకమ్మ మాతా మారెమ్మ అర్చకులు బజారి, గ్రామస్తులు పాల్గొన్నారు.


గోపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సచివాలయం ఆకస్మిక తనిఖీ

చిప్పగిరి: మండలంలోని డేగులహాలు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ సుధాకర్ రాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహులు, సిబ్బంది ఉన్నారు.

జెడ్పీటీసీ పుట్టినరోజు వేడుకలు


ఏరూరుశేఖర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్సీపీ నాయకులు

ఆలూరు: మండల జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్ జన్మదిన వేడుకలు స్థానిక ఆర్అండ్బీ అతిథిగృహంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయనకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, నాయకులు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఆస్పరి జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, ఆలూరు ఎంపీపీ రంగమ్మ, వైస్ ఎంపీపీ నాగవేణి తదితరులు శుభాకంక్షలు తెలియజేశారు.

యోగా పోటీలకు ఎంపిక

మద్దికెర: జాతీయ స్థాయి యోగా పోటీలకు మద్దికెర గ్రామానికి చెందిన చాకలి రంగస్వామి ఎంపిక య్యారు. ఇటీవల విశాఖపట్టణం జిల్లా భీమిలీలో జరిగిన 47వ రాష్ట్రస్థాయి సీనియర్స్ యోగాసన పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 25వ తేదీ రాజస్థాన్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్నట్లు రంగస్వామి తెలిపారు.


చాకలి రంగస్వామి

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న సేవాదళ్ అధ్యక్షుడు పి.మురళీధర్ రెడ్డి

పత్తికొండ రూరల్: మహిళలు స్వయం శక్తితో ఆర్థికాభివృద్ధి సాధించి భవిష్యత్కు బాటలు వేసుకోవాలన్నదే సేవాదళ్ లక్ష్యమని పోచిమిరెడ్డి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.మురళీధర్రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తేరుబజారులోని కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుట్టుమిషన్లు పొందిన మహిళలందరికీ వైఎస్ విజయమ్మ మహిళా ఉపాధి పథకం ద్వారా ఆసరా కల్పిస్తామన్నారు. సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకుడు తుగ్గలి మోహన్రెడ్డి, ఎంపీటీసీ అనిత, దేవగట్టు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొత్తపేట ఉరుసు

ఆలూరు: దేవనకొండ మండలంలోని కొత్తపేట గ్రామంలో హజరత్ దివాన్ మస్తాన్ వలి దర్గా ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా దర్గా భక్తులతో కిటకిటలాడింది. నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు పాల్గొని దర్గాను సందర్శించి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. వారి వెంట జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు దివాకర్ నాయుడు, సర్పంచ్ షేకమ్మ ఉన్నారు. అలాగే వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

గురజాల క్షేత్రంలో ఏర్పాట్లు

నందవరం: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల భద్రత కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సీఐ మోహన్రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు పనులకు శ్రీకారం చుట్టారు. నదీతీరంలో పుణ్యస్నానాలు, దర్శన క్యూలైన్లు, డ్రస్సింగ్ రూములు, వాహనాల పార్కింగ్, ప్రసాద కౌంటర్ల ఏర్పాటుపై శుక్రవారం సీఐ పర్యవేక్షించారు. శివరాత్రి రోజున దాదాపు 30 వేల మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శిస్తారు. 18వ తేదీ మహాశివరాత్రి రోజున జాగారం పురస్కరించుకుని భక్తులు స్వామి సన్నిధిలో గడుపుతారు. అందుకు అనుగుణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు, బారికేడ్లు, క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు. 19వ తేదీ సాయంత్రం రథయాత్ర అంగరంగా వైభవంగా చేపట్టనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసేందుకు పోలీసులు, దేవదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పరిశీలనలో ఎస్ఐ మహేష్కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నరసింహులు, గ్రామ సర్పంచ్ వీరస్వామి, గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు పరమేష్, నరసింహులు, పూజారి హంపేష్స్వామి తదితరులు ఉన్నారు.


గురజాల ఆలయంలో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సీఐ మోహన్రెడ్డి

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: బళ్లారి జిల్లా కేంద్రం నుంచి ఆలూరు మీదుగా వివిధ గ్రామాలలో విక్రయించేందుకు తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేఏ 34ఏ 6310 నంబరు గల టాటా ఏసీ వాహనంలో శుక్రవారం కర్ణాటక మద్యం తరలిస్తుండగా ఆలూరు సెబ్ ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో దాడులు నిర్వహించారు. 864 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హాలహర్వి మండలం కామినహాల్ గ్రామానికి చెందిన గన్నె రాజీవ్, నెట్టెప్ప, ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామానికి చెందిన కల్లు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడులలో పీసీలు శ్రీనివాసులు, సాయికుమార్, రాజ్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.


కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఆలూరు సెబ్ ఎస్ఐ రాజశేఖర్

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ

ఆలూరు: వాల్మీకి కులస్తులు, ఆర్థిక, సామాజిక రంగాలలో రాణించాలని, అందుకు పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని ఆ సంఘం పెద్దలు సూచించారు. హాలహర్వి మండలం నిట్రవట్టిలో గ్రామ వాల్మీకి కమిటీ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్ర వీఆర్పీఎస్ అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, బీజేపీ జాతీయ ఓబీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ పార్థసారథి, వైఎస్సార్సీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు రాంభీమ్నాయుడు, క్రాంతి నాయుడు, వెంకన్న తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ.. వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. ఎంపీపీ బోయ నెట్టికంతమ్మ, జెడ్పీటీసీ సభ్యులు కురుబ లింగప్ప, విరుపాక్షి, చింతకుంట సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, భీమప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


నిట్రవట్టి గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కులసంఘం పెద్దలు


గజ్జహళ్లిలో శివలింగం ఊరేగింపులో పాల్గొన్న శివస్వాములు

ఘనంగా పడిపూజ

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహా శివరాత్రి పురస్కరించుకుని శివదీక్ష తీసుకున్న స్వాములు స్థానిక పోతులింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో పడిపూజ నిర్వహించారు. అనంతరం శివలింగాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి భస్మాన్ని భక్తులు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ భజనలు చేస్తూ భక్తి పారవశ్యంతో పులకించారు. ఒంటి నిండా భస్మంతో అఘోరాల్లా అగుపించారు. గ్రామంలో దాదాపు 50 మంది శివస్వాములు నిత్యం ఈశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ పడిపూజలు చేస్తున్న సంగతి తెలిసిందే. చేతిలో ఖర్పూరం వెలిగించుకుని శివలింగానికి హారతి ఇవ్వడం, సలసలా మరిగే నూనెలో చేతులు పెట్టి బజ్జీలు తీయడం లాంటి కృత్యాలతో శివ స్వాములు స్వామి భక్తి చాటుకుంటున్నారు.

13న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో తిమ్మప్ప స్వామి రథోత్సవం పురస్కరించుకొని ఈనెల 13వ తేదీ ఉదయం 8 గంటలకు న్యూ కేటగిరీ రాష్ట్రస్థాయి వృషభాల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన వృషభాలకు మొదటి బహుమతి రూ.40 వేలు, తరువాతి స్థానాలకు రూ.30 వేలు, రూ.20 వేలు, నాలుగో బహుమతి 16 తులాల వెండి, తర్వాతి స్థానాలకు రూ.10 వేలు, రూ.9 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ. 5 వేలు చొప్పున నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వృషభాల యజమానులు 13వ తేదీ ఉదయం లోపు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 99496 17011, 82478 86829 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

చెట్టు కింద పాఠం


నగరదోణ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు చెట్టు కింద పాఠ్యాంశాలు బోధిస్తున్న దృశ్యం

చిప్పగిరి: నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారి విద్యార్థులకు సకల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఉపాధ్యాయుల నిర్లక్ష్యమో, లేక వేరేదైనా కారణమో తెలియదు గానీ మండలంలోని నగరడోన గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు తరగతులకు సంబంధించిన విద్యార్థులకు చెట్టు కిందనే విద్యాబోధన చేయడంపై గ్రామ ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెట్టు నీడ కొందరికే సరిపోతుండగా మిగతా విద్యార్థులు ఎండలో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పడిప్పుడే వేసవి ఎండలు ముదురుతున్నాయని, తీవ్రత ఎక్కువై విద్యార్థులకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సరిపడా గదులు ఉన్నాయి

నగరడోణ ప్రాథమికోన్నత పాఠశాలలో క్లాసులకు తగ్గట్లుగా గదులు అందుబాటులో ఉన్నాయి. నాడు–నేడు ద్వారా అదనపు గదులు కూడా నిర్మించారు. ఎండలో క్లాసులు నిర్వహించాల్సిన అవసరం లేదు. విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తాం.

– ఎంఈఓ మస్తాన్రావు